11-5-51

కమ్యూనిజం ప్రపంచ ప్రజలకు సన్నిహితంగా వస్తున్నందుకు ప్రజా సామాన్యం దాని మీద గల అపోహలను తొలగించుకోవలసిన దశలో కమ్యూనిజం ఎక్కడ తలఎత్తినా కొట్టేయాలని అమెరికా "బ్రిటన్" ఫ్రాన్సు వగైరా దేశాలలోని పాలకులు భావించటమూ, ఆ భావన ఆధారంగా యుద్ధ ప్రయత్నాలు చేయటమూ జరగటంచేతనే యుద్ధం ప్రమాదం ఏర్పడుతున్నది.

రెండో విషయం: రష్యా శాంతి కొరకు కృషిచేస్తూంటే అది కపటమనీ, అసలు ప్రపంచ శాంతి భంగం కలిగించే చర్యలన్నీ రష్యాయే చేస్తున్నదనీ ప్రచారం సాగించారు. శాంతికోసమే అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు వగైరా దేశాలు అంతులేని స్థావరాలు సంపాదించి యుద్ధ యత్నాలు సాగిస్తున్నట్టు కూడా ప్రచారం జరుగుతున్నది. ప్రపంచ యుద్ధమంటే భయం రష్యా మొదలైన దేశాల కెక్కువఉంటుందా, యుద్ధ యత్నాలవల్ల ఆర్థికంగా లాభాలు గడించే వారికెక్కువ లాభం ఉంటుందా అని మనం ఆలోచించుకోవచ్చు. ఇప్పటికే అమెరికా బ్రిటనులలో యుద్ధ యత్నాలలో పాల్గొనే వారి లాభాలు ఎట్లా పెరిగి పోతున్నదీ మన చూడగలుగుతున్నాం. ఈ లాభాలు పొందే వర్గాల వారే తమకు కావలిసినది శాంతి అనటంకంటే హాస్యాస్పదమైన విషయం ఉండబోదు. యుద్ధ భయంలేక పోగా యుద్ధం అత్యవసరమై ఉన్న ఈ వర్గాన్ని తప్ప మిగతా అన్ని ప్రజా వర్గాలతోనూ చేతులు కలపటానికి కమ్యూనిజము శాంతి ఉద్యమాన్ని నడుపుతూ ఉంటే అందుకు కమ్యూనిజమును అభినందించక పోగా కమ్యూనిజంతో కలిసి శాంతి సాధించే కన్న యుద్ధ ప్రమాదాన్ని వాంఛించే వారు కూడా ఉన్నారు! కమ్యూనిజం ఒక విలక్షణమైన శక్తిగా, ఉన్నపుడు దాన్ని నిర్లక్ష్యంగా చూసి అది తమకన్న ఎన్నో రెట్లు సంఖ్యలు గల ప్రజావర్గాలతో చేతులు కలుపుతున్నప్పుడు అది విజృంభిస్తున్నదని ఆక్రోశించే వారున్నారు. ఇటువంటి అయోమయపు ఆక్రోశాలవల్లనే ప్రపంచ వినాశకుల భాష నాశనానికి గురి అయ్యే వారినోట వినిపించటం జరుగుతున్నది.

ఈ పరిణామం మరి కొంత దూరం సాగినట్టయితే ప్రపంచ యుద్ధం తప్పక అనివార్యం కావటమే కాక కమ్యూనిస్టు ప్రమాదం అన్న ముక్కకు అర్థమే లేకుండా పోతుంది. ఈ శాంతి ఉద్యమం నడిచినకొద్దీ కమ్యూనిస్టు శక్తులకు అన్ని రకాల ప్రజాశక్తులతోనూ సమగ్ర సామరస్యం ఏర్పడక తప్పదు.

రామరాజ్యంలో

# భక్తుల కోర్కెలు తీర్చే మంత్రులు

ఆర్. యం. చిదంబరం

ఏమీతోచక సాయంత్రం పార్కుకి వెళ్ళాను.

అక్కడంతా ఒకటే హడావుడి. మంత్రిగారు వస్తున్నారంటే మంత్రిగారు వస్తున్నారని. నా మిత్రుడొకడన్నాడు: "చూశావుట్రా! మంత్రిగారికి మన మీద కనికరం కలిగి రేపు వస్తున్నారు" అన్నాడు. "ఎందుకోసం?" అన్నాను.

"ఎందుకంటావేమిటి నీ మొహం. ఆకలికి ఎంతమంది మాడుతున్నారో చూచి ప్రభుత్వానికి తెలియబర్చాలట. పైగా పురజనుల కోర్కెలు తెలుసుకుని వారికి సహాయం చేయటానికి వస్తున్నారు" అన్నాడు.

"మంచిదే. శుభం" అన్నాను.

"మంత్రిగారికి సుస్వాగతం" అని బోర్డులు తెగ వ్రాస్తున్నారు. సభావేదికను రమ్యంగా అలంకరిస్తున్నారు. పెద్దలందరూ తమతమ కోర్కెలను (గ్రామానికిసంబంధించినవిసుమండి) తెలియ బరుస్తూ మంత్రిగారికి పెటీషన్లు తయారు

చేస్తున్నారు. మా ఊరు హోటలు అయ్యారు సహితం పెటిషను తయారుచేశాడు. తన మీద మునిసిపలు వాళ్ళు అక్రమంగా న్యూసెన్సు కేసు పెట్టారనీ, అదిరద్దు చేయమనీ, కోరుతూ వ్రాశాడు. నేనీ హడావుడంతా చూచి మంత్రి గారిని తప్పకుండా చూడాలని ఇంటికి వచ్చి ఈ విషయమై మా ఆవిడను హెచ్చరించి పడకమీద మేనువాల్చాను.

తెల్లవారింది. మంత్రిగారు వచ్చే టయిము యింది. పెద్దలంతా ఆహ్వానానికి సంసిద్ధులై యున్నారు. ఏ కారు వచ్చినా మంత్రిగారిదే నని గాభరా పడుతున్నారు. చివరకెలాగయితే నేం మా అదృష్టం కొద్దీ ఏడింటికి వస్తానన్న మంత్రిగారు ఏడింటికి హాజరయ్యారు.

ఊరి పెద్ద ముందుగా వెళ్ళి దండవేశాడు. మిగిలినవాళ్లు కూడా దండవేయబోతే మంత్రి గారు మందహాసంతో వాటిని తాకి బంట్రోతు కందించారు. అందరూ కలిసి మంత్రిగారిని సభా వేదికపైకి తోడ్కొని పోయారు. మంత్రి గారి ముందు పెటిషన్ల వర్షం కురిసింది. మంత్రి గారు కొన్ని పెటిషన్లను చూచి కొన్నిటిని బంట్రోతు కందించారు.

అధ్యక్షుడు లేచి ఉపన్యాసం ప్రారంభించాడు. మంత్రిగారు దేశానికి చేసిన సేవను, ప్రస్తుతం చేస్తున్న త్యాగాన్ని, ఇక ముందు చేయబోయే ఘనకార్యాల గురించీ చెప్పాడు. తరువాత మంత్రిగారు ఎన్నిసార్లు జెయిలుకు వెళ్ళారో, ఎప్పుడెప్పుడు వెళ్ళారో, ఎన్ని సార్లు లాఠీ చార్జీలు తిన్నారో వివరంగా చెప్పి మంత్రిగారిని మాట్లాడమని కోరాడు.

మంత్రిగారు లేచి ఉపన్యాసం ప్రారంభించారు: "ప్రస్తుతం తీరిక లేకపోవటంవలన అన్ని పెటిషన్లను చూడలేక పోయినందుకు నన్ను క్షమించాలి. అయినా, కొన్ని చూచాను. అందులో అతి ముఖ్యమైన పెటిషనొకటి కనిపిస్తూంది. అందులో, భద్రాచలం గుడి ఈ ఊరికి చాలదూరంలో ఉన్నట్టు, అందువలన భక్తులు చాలాయిబ్బంది పడుతున్నారనీ, ఎలాగయినా దాని నిక్కడకు తీసుకు రావాలనీ తెలుపబడింది. దైవ భక్తులకు నిలయమైన ఈ భరత భూమిలో భక్తుల కోర్కెను మన్నించటం ప్రభుత్వ విధి. భద్రాచలం గుడిని తీసుకురావటం కష్టసాధ్యం. అయినా చూస్తాం. ప్రయత్నిస్తాం. గుడిని తీసుకురావటం విమానాలమీదగాని లారీల మీదగాని వీలుపడదు. అందుకు ప్రత్యేకంగా క్రొత్తరైలు మార్గాలు వేసి, క్రొత్త రైలును సృష్టించాలి. ఇందుకు అమిత ధనం వ్యయమవుతుంది. అసలే దేశం ఆర్థికంగా దెబ్బతిన్న ఈ సమయంలో ఈపనికిపూనుకుంటే మరీచిక్కులు వస్తాయి. దీనికని ప్రత్యేకంగా చందాలు వసూలుచేసినా డబ్బుచాలదు. పోనీ, ఏమైనా అదనంగా పన్నులు వేద్దామా అంటే ప్రజా రాజ్యంలోని ప్రజలమీద అనవసరంగాపన్నులు వేసి మిమ్మల్ని యిబ్బంది పెట్టదలచుకోలేదు. అసలే మీరంతా పన్ను లెక్కువయి పోయాయని గోలపెడుతున్నారు. మీరు ధైర్యంగా, పట్టుదలగా కష్టాలకోర్చి నిలబడండి. మనం స్వతంత్రులం. స్వాతంత్ర్యం లభించిన కొన్ని ఏళ్ళవరకు అన్ని దేశాలు మనకంటె ఎక్కువగా బాధపడ్డాయి. కాలం ఎల్లప్పుడూ ఒకేరీతిగా ఉండదు. మేము ఉన్నంతకాలం మీకు ఏమీ భయంలేదు. భద్రాచలంగుడినిక్కడకు తీసుకురావటానికి మాశక్తివంచనలేకుండాయత్నిస్తాం. సెలవు" అని మంత్రిగారు వేదిక దిగారు. ఆయన కారులో వెడుతూ అధ్యక్షుడు వేదిక మీద నిలబడి చెప్పుతున్న కృతజ్ఞతాభివందనాలను స్వీకరించారు.

మంత్రిగారు, హోటలు ప్రొప్రయిటరు పెటిషను చూచి అతని హోటలును పరీక్ష చేయటానికి వెళ్ళారు. ఊరివారంతా అక్కడ చేరారు. మంత్రిగారు హోటలంతా పరీక్షించి ఒకఅరగంటకు బయటకువచ్చి హెల్తాఫీసరుతో హోటలంతా పరిశుభ్రంగా ఉందనీ కేసురద్దు చేయమనీ రికమండ్ చేసి వెళ్ళిపోయారు.

'ఎంతో న్యాయంగా, కచ్చితంగా నడచుకుంటున్న హెల్తాఫీసరు చేసిన పనిలోకూడా తప్పు పట్టారే ఈ మంత్రిగారు' అని జనమంతా ముక్కుమీద వేలు వేసుకున్నారు.

'తూర్పున చెరువొకటి తవ్వించమని నేను వ్రాసిన పెటిషనును చూడకుండానే వెళ్ళిపోయాడే' అన్నాడొక పెద్దమనిషి సంతాపంగా.